నిధుల స్వాహాకు స్వర్ణతో చెక్

కొన్ని పంచాయతీల్లో కొంతమంది సిబ్బంది చేతివాటం చూపేవారు. మ్యాన్యువల్ విధానంలో పన్నుల వసూళ్లు, ఖర్చు పెట్టే డబ్బులకు సంబంధించి కూడా ఇదే పద్ధతి ఉండడంతో నిధుల దుర్వినియోగం జరిగేది. అయితే ఈ నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేలా ఆ శాఖ చర్యలు తీసుకుంటోంది. ఖర్చు చేసే ప్రతి రూపాయికి పంచాయతీ కార్యదర్శులు ఇక నుంచి పక్కాగా లెక్క చూపించాల్సిందే. వచ్చే నెల ఒకటి నుంచి స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ద్వారానే కార్యదర్శులు నిధులు ఖర్చు చేయాలి. ఇప్పటికే ఆస్తి, నీటి పన్ను బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించే విధానాన్ని అమలులోకి తెచ్చింది.

- పంచాయతీల్లో చేతివాటం చూపుతున్న కొందరు సిబ్బంది
- మాన్యువల్ విధానంలో ఉండడం వల్లే అక్రమాలకు తావు
- 1వ తేదీ నుంచి స్వర్ణ పంచాయతీ అమలుకు సన్నాహాలు
- కచ్చితంగా లెక్కలు చూపాల్సిందే


అసెస్‌మెంటు వివరాలు నమోదు చేస్తున్న పంచాయతీ అధికారులు (ఫైల్)


చిత్తూరు కార్పొరేషన్: పన్నుల వసూళ్లు మ్యాన్యువల్ విధానంలో ఉండడంతో అక్రమాలకు చోటు చేసుకుంటున్నాయి. పన్నుల చెల్లింపులు రశీదులను గ్రామీణులకు ఇవ్వడం వారి వద్ద నుంచి వసూళ్లు చేసిన మొత్తాన్ని కొందరు బ్యాంకులో కట్టకుండా స్వాహా చేస్తున్నారు. దీంతో ఇక మున్సిపాలిటీ తరహాలో ఆన్‌లైన్ విధానాన్ని పంచాయతీలో తీసుకొస్తున్నారు. జిల్లాలో 697 పంచాయతీలు ఉండగా ఈ ఏడాది పన్నుల ద్వారా రూ.20 కోట్లు ఆదాయ లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 3,09,008 అసెస్‌మెంట్లను ఆన్‌లైన్ చేశారు. 15వ ఆర్థిక సంఘం, ఆస్తి, నీటి పన్ను, లైసెన్స్‌లు, మైనింగ్, రిజిస్ట్రేషన్ సెస్‌ల రూపంలో ఏటా రూ.కోట్లల్లో నిధులు పంచాయతీల ఖాతాల్లో జమవుతున్నాయి. కొందరు కార్యదర్శులు చేతివాటం చూపుతున్నారు. పనులు చేయకుండానే చేసినట్లు చూపి రూ.లక్షల్లో స్వాహా చేస్తున్నారు. పారిశుద్ధ్య సామగ్రి, వీధి దీపాల కొనుగోలులో భారీగా అవినీతికి పాల్పడుతున్నారు. బ్లీచింగ్ సున్నం కొనుగోళ్లలో జిల్లాలో అవినీతి అధికారులు లక్షలు దిగమింగారు. వాస్తవంగా తక్కువగా కొనుగోలు చేస్తూ లెక్కల్లో మాత్రం ఎక్కువగా చూపుతున్నారు. ఆస్తి పన్ను కింద వసూలైన నిధులు దారి మళ్లించి కొందరు కార్యదర్శులు రూ.లక్షల్లో దోపిడీకి పాల్పడ్డారు.

పలు ప్రాంతాల్లో కార్యదర్శుల అక్రమాలు

ఖర్చు చేసే ప్రతి రూపాయికి లెక్క

1వ తేదీ నుంచి సన్నాహాలు

పెద్ద పంచాయతీల్లో రూ.లక్షల్లో చిన్న పంచాయతీల్లో రూ.వేలల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. కొందరు కార్యదర్శులు దొంగబిల్లులతో పంచాయతీ ఖజానాకు కన్నం పెడుతున్నారు. అక్రమాలకు అడ్డుకోవడానికి సెప్టెంబర్ 1వ తేదీ నుంచి స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ద్వారా లావాదేవీలు జరుగనున్నాయి. ఈ విధానం ద్వారా గుండు సూది కొనుగోలు నుంచి పారుగు సేవల సిబ్బందికి జీతాల చెల్లింపు వరకు సమగ్ర వివరాలతో పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం తప్పనిసరి చేశారు.


స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్

ఈ ఏడాది కాలంలో పలుచోట్ల కార్యదర్శులు చేసిన అక్రమాలు ఇలా..

- ఆగస్టు 2న పూతలపట్టు మండలం గాండ్లపల్లె పంచాయతీ కార్యదర్శి గోపీనాథ్ రూ.2.45 లక్షలు పింఛన్ సొమ్మును బాధితులకు ఇవ్వలేదు. దీనిపై ఎంపీడీఓ శ్రీనివాసులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ డబ్బును రికవరీ చేసి బాధితులకు పింఛన్ ఇప్పించారు.
- జూలై 7న యాదమరి మండలం 14 కండిగ్ర ముస్లింవాడలో పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ సాధారణ నిధుల నుంచి రూ.1.48 లక్షలు తన ఖాతాకు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.2.51 లక్షలను ఏకంగా తన తల్లి ఖాతాకు మళ్లించేశాడు.
- గతేడాది మార్చి 21న బంగారుపాళ్యం మండలం గుండ్లకట్టమంచి పంచాయతీ కార్యదర్శి ఉమాపతి రూ.3.68 లక్షలు దుర్వినియోగం చేయడంతో సస్పెండ్ చేశారు.
- గత సంవత్సరం డిసెంబర్ 26న అవినీతికి పాల్పడినందుకు రామకుప్పం, శాంతిపురం మండలాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సాధిక్‌అలీ, బంగారునాయక్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారు. వీరు డిజిటల్ కీ ని దుర్వినియోగం చేయడంతో వాటి ద్వారా తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాలను సృష్టించారు.

పారదర్శకంగా పాలన

“ ప్రతి బిల్లు స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో వివరాలు తెలుస్తాయి. దీంతో అక్రమాలు జరగడానికి ఆస్కారం ఉండదని భావిస్తున్నాం. ఇక ప్రతి చెల్లింపును ఆన్‌లైన్‌లో నమోదు అవుతుంది. వీటి ద్వారా పారదర్శక పాలన అందించవచ్చు. పలు ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమాలకు చెక్ పడుతుందని భావిస్తున్నాం.

– సుధాకర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి



క్లుప్తంగా

స్మార్ట్ రేషన్ కార్డులపై తహసీల్దార్ సమీక్ష


రేషన్ కార్డులను అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

గుడిపాల: స్మార్ట్ రేషన్‌కార్డులను పక్కాగా పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో రేషన్‌షాపుల డీలర్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, 49 రేషన్ షాపులకు గాను 12,504 స్మార్ట్ కార్డులు వచ్చాయని, షాపుల వారీగా వాటిని డీలర్లకు ఇస్తామని, శుక్రవారం నుంచి గ్రామాల్లో వీఆర్‌ఓలు, డీలర్లు కలిసి లబ్ధిదారులకు వీటిని అందజేయాలన్నారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకులను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు.

నిత్యాన్నదానానికి కూరగాయలు విరాళం


కూరగాయలు అందజేస్తున్న హైదరాబాద్ వాసులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన సుబ్రమణ్యం, సంధ్యారాణి శుక్రవారం కూరగాయలను విరాళంగా ఈఓ పెంచల కిశోర్‌కు అందజేశారు. అనంతరం వారికి దర్శన ఏర్పాట్లు చేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

పూతలపట్టు(యాదమరి): ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి సుఖమయ జీవనానికి బాటలు వేసుకోవాలని ఆకనంబట్టు సర్పంచ్ ఎమ్మెస్ మణి అన్నారు. శుక్రవారం ఆకనంబట్టులో సర్పంచ్ ఆధ్వర్యంలో ఐసీటీసీ, 104 మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఐసీటీసీ శిబిరంలో దాదాపు 48 మందికి హెచ్‌ఐవీ, ఆర్‌సీఆర్, హెచ్‌బీఎస్‌ఏజీ పరీక్షలు చేసిన అనంతరం 104 శిబిరంలో మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అరవింద్, సిబ్బంది మనోజ్, మాధవి, అశోక్‌కుమార్, శోభ, ఏఎన్‌ఎంలు లత, రాధ, ఆశా కార్యకర్త రీటా తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించండి



ర్యాలీ నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు, టీచర్లు

ఐరాల: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సీతాపతినాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు, ఒలింపిక్ స్వర్ణ పతక విజేత, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకుని తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి బజారువీధి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు రాజేష్, పీడీ బాబు, ఉపాధ్యాయురాలు దీప్తి పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు



పాలమాకులపల్లె వద్ద డివైడర్‌ను ఢీకొన్న కారు

బంగారుపాళెం: కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటన శుక్రవారం సాయంత్రం మండలంలోని పాలమాకులపల్లె సర్వీస్ రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం..మండలంలోని వినాయకపురానికి చెందిన వెంకటస్వామి చిత్తూరు నుంచి స్వగ్రామానికి కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నోటీస్ బోర్డు

నేడు మూషిక వాహనసేవ

- **కాణిపాకం:** వార్షిక బ్రహ్మోత్సవాల్లో కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి శనివారం రాత్రి మూషిక వాహనంపై విహరిస్తారు. కాణిపాకం, తిరువణంపల్లె, అగరంపల్లె, కాణిపాక పట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె గ్రామస్తులు, విశ్వకర్మ వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరిస్తారని ఆలయ అధికారులు తెలిపారు.

దసరా బ్రహ్మోత్సవాలకు కొటేషన్లు ఆహ్వానం

- **చిత్తూరు రూరల్ (కాణిపాకం):** సెప్టెంబర్ 22వ తేదీ నుంచి చిత్తూరు గిరింపేట దుర్గాంబ దేవస్థానంలో నిర్వహించనున్న దసరా బ్రహ్మోత్సవాల పలు నిర్వహణకు కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ తిమ్మారెడ్డి తెలిపారు. అమ్మవారి అలంకరణ, పందిళ్లు, అలంకరణ, విద్యుత్ అలంకరణ, పుష్పాలంకరణ, మోత కూలీలు, వంటకూలీలు, వంటపాత్రలు, అన్నప్రసాద సామగ్రి తదితర వాటికి 10వ తేదీ లోపు కొటేషన్లు తమ కార్యాలయంలో ఇవ్వాలని ఆయన కోరారు.

నేడు మొగిలిలో హుండీ కానుకల లెక్కింపు

- **బంగారుపాళెం:** మండలంలోని మొగిలి శివాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు ఆలయ ఆవరణలో స్వామి వారి హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించనున్నట్లు ఈఓ మునిరాజ శుక్రవారం తెలిపారు.

రైతులకు పంట రుణాలు

యాదమరి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని అర్హత గల రైతులకు పంట రుణాలు మంజూరు చేస్తామని సింగిల్‌విండో చైర్‌పర్సన్ చిత్రానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పంటలకు రూ.5లక్షలు, రూరల్ హౌస్‌మార్ట్ గేజి ద్వారా గ్రామీణ ప్రజలకు రూ.3 లక్షల నుంచి 5లక్షల వరకు రుణాలిస్తామని, ఆసక్తి గలవారు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మహోన్నతమైనది మాతృభాష



బంగారుపాళెం: నివాళులు అర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు



గుడిపాల: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బంగారుపాళెం: మాతృభాష మహోన్నతమైందని ఎగువ రాగిమానుపెంట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నాగమణి అన్నారు. వ్యవహారిక భాషకు ఆద్యుడైన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి హెచ్‌ఎం మాట్లాడారు. మాతృభాషతో పాటు ఇతర ప్రాంతీయ భాషలను నేర్చుకోవాలని, విద్యార్థులు బహుభాషలపై పట్టుసాధిస్తే భవిష్యత్‌లో ఉపాధి కోసం ఏ ప్రాంతానికి వెళ్లినా భావ వ్యక్తీకరణకు ఇదో సాధనంగా ఉపకరిస్తుందన్నారు. మండలంలోని టేకుమంద, మొగిలిమిట్టూరు, రాగిమానుపెంట, తుంబకుప్పం, తుంబపాళెం, మంగళపల్లె, గుండ్లకట్టమంచి, పిడివి కండ్రిగ, బోడబండ్ల, కీరమంద జెడ్పీ హైస్కూలు, ఎస్టీ గురుకుల పాఠశాల, పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యవహారిక భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, పద్య పఠన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన 'చదువు గొప్పదనం' నాటిక ఆలోచనలు రేకెత్తించింది. అలాగే, ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా పాఠశాలల్లో క్రీడాది నోత్సవం ఘనంగా నిర్వహించారు.హెచ్‌ఎంలు, టీచర్లు, సీఆర్‌పీలు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

తెలుగు మాధుర్యాన్ని జగతికి చాటుదాం

గుడిపాల: తెలుగు మాధుర్యాన్ని ప్రపంచానికి చాటి, తెలుగు ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలని సీఎన్‌ఆర్ కళాశాల వ్యవస్థాపకులు లోకేష్ అన్నారు. స్థానిక సీఎన్‌ఆర్ కళాశాలలో శుక్రవారం తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గ్రాంధిక భాషను వాడుక భాషలోకి తెచ్చిన ఘనుడు గిడుగు రామ్మూర్తి దంపతులు అని కీర్తించారు. విద్యార్థులు మాతృభాషపై మమకారం కలిగి ఉండాలన్నారు. తెలుగు అధ్యాపకులు అర్జున్ మాట్లాడుతూ, విద్యార్థులు మాతృదేశాన్ని , మాతృభక్తిని గౌరవించే సంస్కారం అలవరచుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేసి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు, ప్రధానోపాధ్యాయులు సుధ, వ్యాయామోపాధ్యాయుడు వినోద్, అధ్యాపకులు మీనా, కుమారి, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

తెలుగుభాష గొప్పదనం మరవరాదు

ఐరాల: తెలుగుభాష గొప్పతనం విద్యార్థి దశ నుంచే చాటి చెప్పాలని, మాతృభాషను ఎప్పటికీ మరవరాదని పుత్రమద్ది, ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్‌ల హెచ్‌ఎంలు లక్ష్మణ్‌బాబు, భానుప్రకాష్ అన్నారు. శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయులు హేమచంద్రరెడ్డి, కన్నయ్య, కేశవులు పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: మండలంలోని కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌లో తెలుగు విభాగం ఉపాధ్యాయులు షణ్ముగం, మంజుల విద్యార్థులకు పద్య పఠనం, వ్యాస, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే, క్రీడల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, టీచర్లు కనకాచారి, మదన్‌మోహన్, దామోదర్‌రెడ్డి, అరుణ, మంజులత తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషపై మమకారం పెంచుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు మాతృభాషపై మమకారం పెంచుకోవాలని బృందావన్ సీబీఎస్‌ఈ పాఠశాల వ్యవస్థాపకులు శైలజ అన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. వ్యవహారిక భాషాభివృద్ధి కోసం గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషిని ప్రస్తుతించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన లఘు నాటికలు ఆకట్టుకున్నాయి. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్కూల్ డైరెక్టర్ ప్రియతేజ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయం విద్యాసంస్థల్లో.

సుందరరాజపురంలోని విజయం విద్యాసంస్థల్లో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజ మాట్లాడారు. అనంతరం ఆ స్కూల్‌లో 9 వ తరగతి విద్యార్థులు నిర్వహించిన అష్టావధానం ఆకట్టుకుంది. హెచ్‌ఎం శ్రీదేవి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఐరాల: ఎం.పైపల్లెలో..


బృందావన్ సీబీఎస్‌ఈ పాఠశాలలో...


విజయం పాఠశాలలో....

దోమల మోత..జ్యూస్ ఫ్యాక్టరీ వ్యర్థాల కంపు


సమస్యలను వైద్యసిబ్బందికి తెలియజేస్తున్న సీకే పల్లె గ్రామస్తులు

గుడిపాల: ఓ వైపు దోమల మోత, మరోవైపు జ్యూస్ ఫ్యాక్టరీ వ్యర్థాల దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సీకే పల్లె గ్రామస్తులు వైద్యసిబ్బందికి నివేదించారు. శుక్రవారం సీకే పల్లెలో వైద్య వైద్యాధికారులు ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి లార్వా సర్వే చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. తమ గ్రామం పక్కలోనే జ్యూస్ ఫ్యాక్టరీ ఉండడంతో వ్యర్థాలను గ్రామం పక్కనే ఉన్న నీటికుంటలోకి వదిలేస్తున్నారని, దీనివల్ల దోమలు విజృంభిస్తున్నాయని, వ్యర్థాల దుర్గంధం చిమ్ముతోందని, ఈ సమస్యలు లేకుండా చూడాలని కోరారు. దీనివల్ల దోమలు అధికంగా ఉండడంతో పాటు దుర్వాసన వెదజల్లుతూ కంపుకొడుతుందని వారికి తెలియజేశారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారు.

చిత్తూరు కౌన్సిల్‌లో పలు అంశాలకు ఆమోదం



మాట్లాడుతున్న మేయర్ అముద, పాల్గొన్న కార్పొరేటర్లు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. మేయర్ అముద, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. నగరంలో ఇంజినీరింగ్, పారిశుద్ధ్య పనులు చేయడానికి 167 మందిని దినసరి వేతనం కింద తీసుకోవడానికి, కట్టమంచి–మైదా ఫ్యాక్టరీ రోడ్డు నిర్మాణం, కార్పొరేషన్‌లో 25 పోస్టులను ప్రభుత్వానికి సరెండర్ చేయడం కోసం ప్రతిపాదించిన అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. కట్టమంచి చెరువులో పూడికతీతకు, కట్ట విస్తరణకు జిల్లా మినరల్ ఫండ్ ట్రస్టు నుంచి భూగర్భ గనులశాఖ ద్వారా రూ.79.50 లక్షలు చెల్లించడానికి ఆమోదించారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, ప్రతినెలా కౌన్సిల్ సమావేశం నిర్వహించి కార్పొరేటర్లు వార్డు సమస్యలు మాట్లాడటానికి అవకాశం కల్పించాలని, గిరింపేట రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని, పీసీఆర్ కూడలి, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద బస్ షెల్టరు నిర్మించాలని కోరారు. కట్టమంచి కార్పొరేటర్ హరిణిరెడ్డి మాట్లాడుతూ మైదా ఫ్యాక్టరీ–కట్టమంచి రోడ్డును త్వరగా పూర్తి చేసి సీఆర్.రెడ్డి పేరు పెట్టాలని కోరారు. కొంగారెడ్డిపల్లె కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి మాట్లాడుతూ, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని, తన వార్డులో వర్షం పడితే చాలా కాలనీలు ముంపునకు గురవుతున్నాయని సమస్యలు నివేదించారు. సరైన కాలువలు నిర్మించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

యాదమరి: ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పత్రపల్లె ఆది ఆంధ్రవాడలో పౌరహక్కులపై పోలీసు, రెవెన్యూ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ, పౌర హక్కులకు భంగం కలిగించడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారికి చట్టపరంగా శిక్షలు తప్పవని హెచ్చరించారు. ప్రజలందరూ సమానమేనని అన్నారు. అందరూ కలసి మెలసి ఉండాలని తహసీల్దార్ పార్థసారథి అన్నారు. పౌరులకు ఉన్న హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలని ఎంపీడీఓ వేణు చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణలో అందరి సహకారం అవసరమని ఎంఈఓ రుక్మిణి చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా కూడా ప్రజల్లో ఇప్పటికీ సరైన చైతన్యం లేకపోవడం బాధాకరమని ఏపీఓ సంధ్యారాణి పేర్కొన్నారు. వివిధ శాఖల సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

'ఉపాధి' వేగవంతం చేయండి

యాదమరి: మండలంలోని ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని ఏపీడీ మల్లికార్జున ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. మినీ గోకులం షెడ్ల నిర్మాణాలపై ఆసక్తి కలిగిన పాడి రైతులను గుర్తించి వెంటనే పనులు మొదలుపెట్టాలన్నారు. ఉద్యానశాఖ అధికారుల సమన్వయంతో అర్హులైన రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించి లక్ష్యాలను అధిగమించాలన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని, ఈ దిశగా క్షేత్ర సహాయకులు శ్రద్ధ వహించాలన్నారు. అలాగే, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ సంధ్యారాణి, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పీఆర్ ఎస్ఈగా చంద్రశేఖర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీరాజ్ (పీఆర్) పీఆర్ఐ విభాగం ఈఈగా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డికి ఎస్ఈగా ఉద్యోగోన్నతి పొందారు. ఈఈగా ఉన్న ఆయనకు గతంలో ఎస్ఈ స్థానం ఖాళీ కావడంతో ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఉద్యోగోన్నతి మూలాన చిత్తూరులోనే ఎస్ఈగా కొనసాగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈఈ స్థానం ఖాళీ కావడంతో అనంతపురం పీఐయూ విభాగం ఎఫ్ఏసీ ఈఈ నవీన్‌కుమార్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పజెప్పారు.

శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు






నృత్యం.. మంత్రముగ్ధం

కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం స్థానిక ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. పలువురు చిన్నారులు, యువతీ యువకులు భరతనాట్యం, కూచిపూడి, నృత్యాలతో సమ్మోహితుల్ని చేశారు. అలాగే, భక్తి గీతాలాపన, కోలాటాలు, భజనలు భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. -కాణిపాకం